

పదవీ స్వీకారోత్సవంలో ఆస్కా నూతన కార్యవర్గం

సమష్టి కృషితో ఆస్కా అభివృద్ధి

● నూతన అధ్యక్షుడు జి.శశిధర్ రెడ్డి



శశిధర్ రెడ్డి, రాజేశ్వరరావు, దిలీప్‌కుమార్, వెంకట సుబ్బారావు, శాంతకుమార్‌లను సత్కరిస్తున్న డాక్టర్ కె.సుబ్బారెడ్డి

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై మహానగరంలో తెలుగు వారి సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ప్రతిభావంతమైన సంస్థగా విరాజిల్లుతున్న 'ఆంధ్ర సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్' (ఆస్కా)ను సభ్యులు, సీనియర్ల సమష్టి కృషితో అభివృద్ధి చేయనున్నట్లు నూతన అధ్యక్షుడు జి.శశిధర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 18న జరిగిన ఎన్నికల్లో 'మెంబర్స్ వాయిస్' ప్యానల్ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అధ్యక్షుడిగా జి.శశిధర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా వై.రాజేశ్వరరావు, కార్యదర్శిగా వడ్ల మూడి దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా మాదాల వెంకట సుబ్బారావు, కోశాధికారిగా ఎల్.శాంతకుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.భానుచందర్, కమిటీ సభ్యులుగా మన్నూరు చలపతి, డి.రవిచందర్, మదన గోపాల్‌రావు, పి.రమేష్‌రెడ్డి, ఎస్‌కే దుర్గాప్రసాద్, దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, పి.రాజేష్, ఎస్‌పి శ్రీనివాస్, గోపాలకృష్ణారెడ్డి, ట్రస్టీలుగా ముంద్రు శ్రీనివాసరావు, కోటారెడ్డి వేణురెడ్డి, వి.విజయేందర్‌రావు, పి.మనోహర్‌రెడ్డి, వి.బాలాజీ, వి.ప్రశాంత్, పి.సంతోష్‌కుమార్, టీవీఎస్ కోటేశ్వరరావు, ఎన్ఎన్ భిక్షం ఎన్నికవ్వగా, గురువారం వారంతా పదవీబాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆస్కా మాజీ అధ్యక్షులు డాక్టర్ కె.సుబ్బారెడ్డి నూతన కమిటీకి బాధ్యతలను అప్పగించి వారిని ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... హనుమజ్జయంతి పర్వదినం సందర్భంగా ఆస్కా పదవీబాధ్యతలు స్వీకరించిన శశిధర్ రెడ్డి కమిటీ సభ్యులంతా అంకితభావంతో పనిచేయాలని సూచించారు. 2016లో తాను తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదని, సర్వసభ్య సమావేశం తీసుకున్న నిర్ణయం మేరకు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి మాట నిలబెట్టుకున్నట్లు తెలిపారు. ఈ కమిటీ తీసుకునే నిర్ణయాలు పారదర్శకంగా ఉండాలని, ఆస్కాకు తానెప్పుడూ అందుబాటులో ఉంటానని సుబ్బారెడ్డి తెలిపారు. తమ ప్యానల్‌ను గెలిపించిన సభ్యులు, సహకరించిన సీనియర్లకు శశిధర్ రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. సభ్యుల సహకారంతో 73 సంవత్సరాల చరిత్ర కలిగిన ఆస్కాను ముందుకు తీసుకెళ్తామని, క్లబ్‌లో ప్రాథమిక సౌకర్యాలను మెరుగుపరచే పనులను వెంటనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా నాణ్యతతో కూడిన సంప్రదాయ తెలుగు వంటకాలతో పాటు, ఇతర సంస్కృతుల వంటకాలను అందిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్కా మాజీ నాయకులు, సీనియర్లు, సభ్యులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

రైల్వే ప్రాజెక్టులకు నిధుల పెంపు

● కేంద్రమంత్రి ఎల్.మురుగన్

● ఆధునికీకరించిన రైల్వే స్టేషన్లు ప్రారంభం

అడయార్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల అభివృద్ధికి 2014కి ముందు కేంద్రప్రభుత్వం రూ.800 కోట్ల నిధులు కేటాయించగా, మోదీ ప్రధాని అయ్యాక రూ.6 వేల కోట్లకు పెరిగాయని కేంద్రమంత్రి ఎల్.మురుగన్ పేర్కొన్నారు. అమృత్ భారత్ ప్రాజెక్టులో భాగంగా, దేశ వ్యాప్తంగా అనేక రైల్వే స్టేషన్లను ఆధునికీకరించగా, తొలిదశలో 109 స్టేషన్లను గురువారం ప్రధాని మోదీ ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. తమిళనాడులో సిద్ధమైన సెయింట్ థామస్‌మౌంట్, సామల్‌పట్టి, చిదంబరం, తిరువణ్ణామలై, మన్నార్గుడి, శ్రీరంగం, విరుదాచలం, పోలూర్, కుళిత్తురై రైల్వే స్టేషన్లను ప్రారంభించారు. థామస్ మౌంట్‌లో ఏర్పాటైన కార్యక్రమంలో కేంద్రమంత్రి ఎల్.మురుగన్‌తో పాటు పలువురు రైల్వే ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మురుగన్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత 2014 నుంచి భారత్ అభివృద్ధిలో దూసుకుని పోతోందన్నారు. ఆధునికీకరించిన 103 రైల్వే స్టేషన్లను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారన్నారు. వీటిలో రాష్ట్రంలో 9 స్టేషన్లున్నాయన్నారు. ఇదే నవ భారత్‌కు గుర్తింపు అని పేర్కొన్నారు. వందే భారత్ రైళ్ళు ఐసీఎఫ్‌లో తయారు చేయగా, ఇవి దేశ వ్యాప్తంగా పరుగులు పెడుతున్నాయన్నారు. అంతేకాకుండా విదేశాలకు కూడా ఎగుమతి చేస్తున్నామన్నారు. రక్షణ రంగ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి భారత్ వృద్ధి చెందిందని వెల్లడించారు. వచ్చే 2027 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా చేరుకోవాలన్నదే మనందరి లక్ష్యమన్నారు. అంతేకాకుండా, దేశంలో రెండు ప్రాంతాల్లోనే చారిత్మాత్మక రైల్వే స్టేషన్లు సిమ్లా, ఊటీల్లో ఉన్నాయన్నారు. వీటి స్వరూపం ఏమాత్రం చెక్కు చెదరకుండా ఆధునికీకరించినట్టు పేర్కొన్నారు.



ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి ఎల్.మురుగన్



చెన్నై అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన 'ఉలగెంగుమ్ కలైంజర్' పుస్తకాన్ని గురువారం అన్నా అరివాలయంలో ఆవిష్కరించి తొలి ప్రతిని ద్రావిడర్ కళగం అధ్యక్షుడు కె.వీరమణికి అందిస్తున్న ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ (చిత్రంలో) డీఎంకే ప్రధాన కార్యదర్శి దురైమురుగన్, కోశాధికారి టీఆర్ బాలు, అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి తదితరులు

మాస్క్ ప్లీజ్ !

పెరుగుతున్న కరోనా కేసులతో ఆరోగ్యశాఖ అప్రమత్తం



పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): జ్వరం, జలుబు, గొంతునొప్పి, దగ్గు, ఒళ్లనొప్పులతో ఆస్పత్రులను ఆశ్రయించే వారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. ఇదే సమయంలో రాష్ట్రంలో 66 కరోనా కేసులు నమోదయ్యాయనే గణాంకాలు ఆందోళనకు గురి చేస్తున్నాయి. దీంతో బహిరంగ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. 2019లో ప్రారంభమైన కరోనా వ్యాప్తి ప్రపంచంలోని అన్ని దేశాలను గడగడలాడించింది. ప్రస్తుతం సాధారణ స్థితి నెలకొన్నా అక్కడక్కడా కరోనా కేసులు నమోదవుతుండగా, ఈ వైరస్ ప్రాణాంతకం కాదని వైద్యనిపుణులు అంటున్నారు. ఈ నేపథ్యంలో, కొద్దిరోజులుగా దేశంలోని పలు రాష్ట్రాల్లో కరోనా కేసులు నమోదవుతున్నాయి. దేశవ్యాప్తంగా 257 మంది కరోనా లక్షణాలతో చికిత్స పొందుతున్నట్లు వార్తలు వచ్చాయి. వారిలో అధికంగా కేరళ రాష్ట్రంలో 95 మంది, తమిళనాడులో 66, మహారాష్ట్రలో 56 మంది, కర్ణాటకలో 13 మంది, పుదుచ్చేరిలో 10 మంది కరోనా లక్షణాలతో చికిత్స పొందుతున్నారు. ఈ విషయమై రాష్ట్ర ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి ఉందని, కానీ తీవ్రమైన హాని కలిగించే అవకాశం లేదన్నారు. బహిరంగ ప్రాంతాల్లో మాస్క్ ధరించడంతో పాటు నివారణ చర్యలు పాటించాలన్నారు. జ్వరం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారు వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని అధికారులు సూచించారు.

కామన్ సింబల్‌పై విజయ్ దృష్టి



చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) తరపున పోటీ చేసే అభ్యర్థులంతా ఒకే గుర్తు (కామన్ ఎలక్షన్ సింబల్) దక్కించుకునేలా ఆ పార్టీ అధినేత, సినీ నటుడు విజయ్ దృష్టిసారించారు. ఇందుకోసం ఆయన అన్ని రకాలైన చర్యలు చేపడుతున్నారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తలపడేందుకు డీఎంకే, అన్నాడీఎంకే సారథ్యంలోని ప్రధాన కూటములు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో గత ఏడాది పార్టీని స్థాపించిన విజయ్.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తమవుతున్నారు. ఇందులోభాగంగా రాష్ట్రంలోని ప్రధాన ప్రాంతాల్లో బహిరంగ సభలు నిర్వహిస్తూ తమ పార్టీ విధి విధానాలు, సిద్ధాంతాలను వివరిస్తున్నారు. అదేసమయంలో ఆ పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా, వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే రాజకీయ పార్టీలు గుర్తులు ఎంచుకునేందుకు 190 గుర్తులను ప్రకటించింది. దీంతో తమ పార్టీకి ఎలాంటి గుర్తు ఎంచుకోవాలన్న అంశంపై ఆ పార్టీ అధ్యక్షుడు విజయ్ కీలక నేతలతో చర్చిస్తున్నారు. ప్రజల్లోకి సులభంగా చొచ్చుకుని వెళ్ళే సింబల్ ఎన్నుకోవాలని భావిస్తున్నారు. మైక్ సింబల్‌ను ఎన్నుకుంటే, తద్వారా విజయ్ గళాన్ని ప్రజలకు మరింత చేరువవుతుందని చెబుతున్నారు. దీనిపై టీవీకే ప్రతినిధులు స్పందిస్తూ ఓటర్లు సులభంగా గుర్తించేలా ఎన్నికల గుర్తు ఎంపిక చేస్తున్నామని, ఆ దిశగానే తమ పార్టీ అధినేత విజయ్ దృష్టిసారించారని వివరించారు. విజయ్ సైతం కొంతమంది తనకు సన్నిహితంగా వున్న సీనియర్ నేతలతో, మాజీ బ్యూరోక్రాట్లతోనూ ఈ వ్యవహారంపై చర్చిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కామన్ సింబల్ రానిపక్షంలో అది తమ పార్టీకి నష్టం జరుగుతుందని విజయ్ గట్టిగా భావిస్తున్నారు.

నిధులెందుకు కేటాయించలేదు?

● 25 శాతం రిజర్వేషన్లకు సంబంధించి కేంద్రాన్ని సంజాయిషీ కోరిన హైకోర్టు

● పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశం



చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 25 శాతం రిజర్వేషన్లకు సంబంధించి నిధులెందుకు కేటాయించడంలేదని కేంద్ర ప్రభుత్వాన్ని మద్రాసు హైకోర్టు ప్రశ్నించింది. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయిస్తున్న 25 శాతం రిజర్వేషన్‌లో అడ్మిషన్లు ఇంకా ప్రారంభించలేదంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై న్యాయమూర్తులు జస్టిస్ జీఆర్ స్వామినాథన్, జస్టిస్ లక్ష్మీ నారాయణన్‌తో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద కేటాయిస్తుంటారని, దానికి సంబంధించి కేంద్రప్రభుత్వం 2021 నుంచి 2023వ విద్యా సంవత్సరం వరకు నిధులను కేటాయించలేదని, ఈ విషయమై ఈ నెల 28న తదుపరి చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు కేటాయించడం లేదని ఈ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది వివరించారు. నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద రాష్ట్రానికి కేటాయించిన నిధుల వివరాలను శుక్రవారం మధ్యాహ్నం 2.15 గంటల్లోపు తమ ముందుంచాలని కేంద్రప్రభుత్వాన్ని ఈ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది.

వేలాంకన్ని వెళ్తూ మృత్యు ఒడిలోకి

● బస్సు-టూరిస్టు వ్యాన్ ఢీకొని ఆరుగురి మృతి ● ఏడుగురికి గాయాలు

ప్రమాదంలో ధ్వంసమైన బస్సు ముందు భాగం





ధ్వంసమైన టూరిస్టు వ్యాన్

టినగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): తంజావూరు సమీపంలో గురువారం వేకువజామున సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందగా, మరో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు నుండి వేలాంకన్నికి ఓ టెంపో వ్యాన్‌లో 12 మంది బయలుదేరారు. తంజావూరు సమీపంలోని చెంగిపట్టి ప్రాంతంలో తారు రోడ్డు పనులు జరుగుతుండటంతో వాహనాలు ఒన్‌వేలో నడుపుతున్నారు. ఆ రహదారిలో వేగంగా వచ్చిన టూరిస్టు వ్యాన్ తంజావూరు నుండి తిరుచ్చి వస్తున్న రాష్ట్ర రవాణా సంస్థ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగంగా నుజ్జునుజ్జయింది. వ్యాన్‌లో ప్రయాణించిన ఇద్దరు మహిళలు సహా నలుగురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. వీరందరినీ చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వెళుతుండగా మార్గమధ్యంలో చార్సెల్ మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స ఫలించక మరొకరు గురువారం ఉదయం మృతి చెందారు. దీంతో మృతుల సంఖ్య 6కు పెరిగింది. వ్యాన్ ప్రయాణికుల్లో గాయపడిన జాన్సన్, జాయిస్, తాషి, రియా, పెల్సియా కరోలిన్, విలియమ్, బస్సులో ప్రయాణిస్తూ గాయపడిన పరమేశ్వరి, పవిత్ర సహా ఎనిమిదిమంది తంజావూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందగానే జిల్లా కలెక్టర్ ప్రియంకా పంకజం, తంజావూరు డీఎస్పీ ఇరారాజారాం సంఘటన స్థలానికి చేరుకుని విచారణ జరిపారు. చెంగిపట్టి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

పొత్తులపై మహానాడులో ప్రకటిస్తా

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తుపై కడలూరు మహానాడులో ప్రకటించనున్నట్లు డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత పేర్కొన్నారు. నామక్కల్‌లో గురువారం జరిగిన డీఎండీకే నిర్వాహకుల సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతానికి అనుసరించాల్సిన విధి, విధానాలను ప్రేమలత వివరించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి 9వ తేదీ కడలూరులో నిర్వహించనున్న పార్టీ మహానాడులో అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తులు, పార్టీ తరుఫున పోటీ చేసే అభ్యర్థుల వివరాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. అంతకు ముందు 234 నియోజకవర్గాల్లో ఎన్నికల ఇన్‌ఛార్జుల ఎంపిక మొదలుపెడతామన్నారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విజయ్ ప్రభాకర్‌తో కలిసి తాను పర్యటించి, పార్టీ నిర్వాహకులను, ప్రజలను కలుసుకోనున్నట్లు ప్రేమలత తెలిపారు. 2021 నుంచి కేంద్ర ప్రభుత్వం ఢిల్లీలో నిర్వహించిన నీతి ఆయోగ్ సమావేశంలో తమిళనాడు తరుఫున డీఎంకే మంత్రులు మాత్రమే పాల్గొన్నారని, కొన్ని సమావేశాల్లో వారిని అనుమతించలేదని, అయితే ఈ నెల 24న జరగనున్న సమావేశంలో తాను పాల్గొనబోతున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించడం పలు అనుమానాలకు దారితీస్తోందని, ఆయన ఎందుకోసం వెళ్తున్నారో రాష్ట్రప్రజలకు స్పష్టంగా చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.



నామక్కల్‌లో మీడియాతో మాట్లాడుతున్న ప్రేమలత

సమాచార దర్శిని

గ్రూప్-4 దరఖాస్తుకు రేపే చివరి రోజు

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 పరీక్షల దరఖాస్తు స్వీకరణ శనివారంతో ముగియనుంది. 3,935 పోస్టుల భర్తీకి ఈ నెల 25న నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులైన వారు www.tnpsc.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 24వ తేది రాత్రి 11.59 గంటల వరకు దరఖాస్తులు సమర్పించవచ్చు. దరఖాస్తులో సవరణలకు 29 నుంచి 31వ తేది వరకు అవకాశం కల్పించారు. గ్రూప్-4 పోస్టుల భర్తీకి సంబంధించిన రాత పరీక్ష జూలై 12వ తేది జరుగనుందని అధికారులు తెలిపారు.

విద్యార్థులకు ఉచిత పుస్తకాలు

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్ యువజన సంఘం, విద్య ట్రస్ట్ ఆధ్వర్యంలో వేప్పేరిలో ఉచిత పుస్తకాలు అందజేయనున్నారు. బీ.కాం, బీబీఎం, బీబీఏ, ఐఎస్ఎం, బీఎస్సీ, బీఈ తదితర యూజీ కోర్సులకు సంబంధించిన పుస్తకాలు ఉచితంగా అందించనున్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాలకు 044-25610978, 25610369 అనే నెంబర్లు సంప్రదించవచ్చని నిర్వాహకులు తెలియజేశారు.

28 నుంచి తపాలా స్టాంపుల సేకరణపై శిక్షణ

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నాసాలైలోని ప్రధాన తపాలా కార్యాలయంలో విద్యార్థులకు తపాలా స్టాంపుల సేకరణపై ఈ నెల 28 నుంచి 30వ తేది వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు వరకు జరిగే శిక్షణకు 6 నుంచి 9వ తరగతికి చెందిన 50 మంది విద్యార్థులను అనుమతించనున్నారు. శిక్షణా ఫీజుగా రూ.250 చెల్లించాల్సి ఉంటుంది. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేయనున్నారు. వివరాలకు 9840590160, 044-28543199 అనే నెంబరులో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సంప్రదించవచ్చని తపాలా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

29 నుంచి కలైంజర్ నిధికి దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): కలైంజర్ మహిళా ప్రోత్సాహక నిధికి అర్హులైన మహిళలు ఈ నెల 29వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ పథకం కింద మహిళలకు ప్రతి నెలా రూ.1,000 అందజేస్తున్నారు. ఈ పథకాన్ని 2023లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. ఈ క్రమంలో, అర్హులైన మహిళలను ఈ పథకంలో లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నట్లు ఇటీవల జరిగిన శాసనసభ సమావేశాల్లో సీఎం ప్రకటించారు. ఆ ప్రకారం, అర్హులైన వారు ఈ నెల 29వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని, అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.

నేటినుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): శుభముహూర్తాలు, వారాంతపు సెలవుల సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 23 నుంచి 25వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు రాష్ట్ర ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ (ఎస్ఈటీసీ) తెలిపింది. ఈ మేరకు ఎస్ఈటీసీ విడుదల చేసిన ప్రకటనలో... కిలాంబాక్కం బస్ టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, తిరుచ్చి, కుంభకోణం, మదురై, తిరునల్వేలి, నాగర్‌కోయిల్, కన్నియాకుమారి, తూత్తుకుడి, కోయంబత్తూర్, సేలం, ఈరోడ్, తిరుప్పూర్ తదితర ప్రాంతాలకు ఈ నెల 23వ తేది 570 బస్సులు, 24న 605 బస్సులు నడుపనున్నారు. అలాగే, కోయంబేడు టెర్మినల్ నుంచి తిరువణ్ణామలై, నాగపట్టణం, వేలాంకన్ని, హోసూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు ఈ నెల 23న వంద బస్సులు, 24న 90 బస్సులు, మాధవరం టెర్మినల్ నుంచి 23న 24 బస్సులు, 24న వంద బస్సులు నడుపనున్నారు. అలాగే, సెలవుల తరువాత తిరిగి వచ్చే వారి కోసం ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఎస్ఈటీసీ తెలిపింది.

రైళ్లలో ఫుట్‌బోర్డుపై ప్రయాణిస్తే జరిమానా

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో ఫుట్‌బోర్డుపై కూర్చొని ప్రయాణించే వారికి రూ.1,000 జరిమానా విధిస్తామని దక్షిణ రైల్వే హెచ్చరించింది. ఈ మేరకు దక్షిణ రైల్వే అధికారులు మాట్లాడుతూ... రైళ్లు, రైల్వేస్టేషన్లలో చోరీలు, లైంగిక వేధింపులు అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు, సబర్బన్ రైళ్లలో కొందరు ప్రవేశ ద్వారం వద్ద ఉన్న మెట్లపై కూర్చొని ప్రయాణిస్తున్నారని, అలాంటి సమయాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలా ప్రయాణించే వారికి రూ.1,000 జరిమానా విధించనున్నామని, రైల్వే పోలీసులు రైళ్లలో ఫుట్ బోర్డుపై ప్రయాణించే వారిని పర్యవేక్షించనున్నారని అధికారులు తెలిపారు.

ప్రకటన బోర్డులకు ఆన్‌లైన్‌లో అనుమతి

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) పరిధిలో ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయాలనుకొనే వ్యక్తులు, సంస్థలు ఆన్‌లైన్ ద్వారా అనుమతి పొందవచ్చు. నగరంలో ప్రకటన బోర్డులు ఏర్పాటుకు జీసీసీ అనుమతి తప్పనిసరి. అందుకోసం సంబంధిత వ్యక్తులు దరఖాస్తుతో పాటు తగిన పత్రాలతో జీసీసీ కార్యాలయానికి వెళ్లి అనుమతి పొందాల్సి ఉంది. ఈ క్రమంలో, ప్రకటన బోర్డులో ఏర్పాటుకోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే సదుపాయం కల్పించారు. www.chennaicorporation.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి జాప్యం లేకుండా సత్వరం అనుమతులు ఇవ్వనున్నారు. అదే సమయంలో అనుమతి లేకుండా ప్రకటన బోర్డులు ఏర్పాటుచేస్తే చర్యలు చేపడతామని జీసీసీ హెచ్చరించింది.

కంటైనర్ లారీ యజమానుల సమ్మె విరమణ

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్‌లో కంటైనర్ లారీ యజమానులు చేపట్టిన సమ్మె విరమించుకున్నారు. కంటైనర్ లారీలకు పార్కింగ్ ఫీజు రూ.100 వసూలు చేయనున్నట్లు హార్బర్ యజమాన్యం ప్రకటించడంపై నిరసన తెలిపిన కంటైనర్ లారీ యజమానుల సంఘం సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ వ్యవహారంపై 12 కార్మిక సంఘాలతో హార్బర్ యాజమాన్యం చర్చలు జరిపింది. పార్కింగ్ ఫీజు చెల్లించేందుకు కంటైనర్ బ్రోకర్స్ అసోసియేషన్, సీఎఫ్ఎస్ అసోసియేషన్ అంగీకరించడంతో, సమ్మె నిర్ణయం వెనక్కి తీసుకుంటున్నట్లు లారీ యజమానుల సంఘం ప్రకటించింది.

కూడన్‌కుళం కేంద్రానికి రష్యా నుంచి కంట్రోల్ రాడ్లు

పార్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లాలోని కూడన్‌కుళంలో భారత్-రష్యా సంయుక్తంగా ఏర్పాటుచేసిన అణువిద్యుత్ కేంద్రంలో వెయ్యి మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. ఆరంభంలో రెండు అణురియాక్టర్లు, ఆ తర్వాత 3,4 రియాక్టర్ల నిర్మాణం పూర్తి కాగా, 5,6 అణురియాక్టర్ల నిర్మాణం జరుగుతోంది. ఈ అణురియాక్టర్లలో విద్యుదుత్పత్తి కోసం ఉపయోగించే కంట్రోల్ రాడ్లను రష్యా దేశం నుంచి దిగుమతి చేయాలని నిర్ణయించారు. ఆ మేరకు రష్యా నుంచి ఈ రాడ్లు మదురై విమానాశ్రయానికి చేరుకోగా, అక్కడి నుండి మూడు కంటైనర్ లారీల్లో ఎక్కించి కేంద్ర పారిశ్రామిక బలగాల భద్రతతో గురువారం తెల్లవారుజామున కూడన్‌కుళంకు తరలించారు. అక్కడున్న గోదాములో కంట్రోల్ రాడ్లను భద్రపరిచినట్లు అధికారులు తెలిపారు.


కూడన్‌కుళంలోని అనువిద్యుత్ కేంద్రం

కొడనాడు ఎస్టేట్ కేసు..
సీబీసీఐడీ విచారణకు ఆత్తూర్ రమేష్

టి.నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత వేసవి విడిది కేంద్రం కొడనాడు ఎస్టేట్‌లో 2017లో జరిగిన వాచ్‌మన్ హత్య, మరోవాచ్‌మన్‌పై హత్యాయత్నం, దోపిడీ, కంట్రోల్ రూమ్ ఇన్‌ఛార్జి ఆత్మహత్య తదితర సంఘటనలపై విచారణ జరుపుతున్న సీబీసీఐడీ ఈ కేసులతో సంబంధం ఉన్న ఆత్తూర్ రమేష్‌ను గురువారం ఉదయం విచారించారు. కొడనాడు కేసులకు సంబంధించి కేరళకు చెందిన మనోజ్, సయాన్, సతీషన్, సంతోష్ సామి, మనోజ్‌సామి సహా 10మందిని అరెస్టు చేశారు. ఈ కేసులపై ఊటీ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసులతో సంబంధం కలిగి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కారు డ్రైవర్ కనకరాజ్ సోదరుడు ధనపాల్‌ను విచారించే సమయంలో సేలం జిల్లా ఆత్తూరుకు చెందిన రమేష్ సాక్ష్యాలను చెరిపేందుకు ప్రయత్నించినట్లు తెలుసుకున్నారు. ధనపాల్, రమేష్ తదితరులను అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరిద్దరు బెయిలుపై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో ఆత్తూరు రమేష్‌కు విచారణకు హాజరు కావాలంటూ సీబీసీఐడీ పోలీసులు సమన్ జారీ చేశారు. ఆ మేరకు గురువారం ఉదయం కోవైలో ఉన్న సీబీసీఐడీ కార్యాలయంలో ఆత్తూరు రమేష్ విచారణకు హాజరయ్యారు. కొడనాడు కేసులకు సంబంధించి ఇప్పటివరకూ సీబీసీఐడీ పోలీసులు సుమారు500 మందిని విచారించారు.


కోవైలోని సీబీసీఐడీ కార్యాలయం- విచారణకు హాజరైన ఆత్తూర్ రమేష్

నాగపట్టినం జాలర్లపై శ్రీలంక నావికాదళం దాడి


శ్రీలంక నావికాదళం దాడులతో తీరానికి తిరిగొచ్చిన జాలర్లు

టి.నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): తమిళ జాలర్లపై శ్రీలంక నావికాదళం మరోమారు విరుచుకుపడింది. కోడియక్కరై వద్ద బుధవారం అర్ధరాత్రి ఫైబర్ పడవలో చేపలు పడుతున్న నాగపట్టినం జిల్లా సెరుందూరు గ్రామానికి చెందిన జాలర్లు ఐదుగురిపై శ్రీలంక నావికాదళం దాడులకు పాల్పడ్డారు. పడవలో ఉన్న రూ.2.60 లక్షల విలువైన 700 కేజీల వలలు, డీజిల్, వాకీటాకీ, జీపీఎస్ పరికరాలను దోచుకున్నారు. శ్రీలంక నావికా దళం దాడులతో గాయపడిన జాలర్లు తీరానికి వేగంగా బయలుదేరారు. గురువారం వేకువజాము సెరుందూరు తిరిగొచ్చిన జాలర్లు స్థానిక జాలరి సంఘం నాయకులు కలిసి మత్స్య శాఖ ఉన్నతాధికారులకు శ్రీలంక నావికాదళం దోపిడీ సంఘటనపై పిర్యాదు చేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో చేపట్టనున్న మరమ్మతుల కారణంగా దిగువ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

చోళవరం: సోత్తుపెరుంబేడు, కారనోడై, ఒరక్కాడు రోడ్డు, కొట్టాయ్‌మేడు పెరియ కాలనీ, సెంబులివరం.

మైలాపూర్: శాంతోమ్ హైరోడ్డు, డూమింగ్‌కుప్పం, డూమింగ్ లైన్, ముల్లైమా నగర్, శ్రీనివాసపురం, ఈస్ట్ సర్కిల్ రోడ్డు, మాతా చర్చి రోడ్డు, లాజర్ చర్చి, రోసరి చర్చి రోడ్డు, ముత్తు వీధి, అప్పు వీధి, సయ్యద్ వాహన్‌హుస్సేన్ వీధి, ఎన్ఎంకే వీధి, కచేరి రోడ్డు, నొచ్చికుప్పం, పాపనాశం రోడ్డు, బజార్ రోడ్డ కన్నిలా వీధి, దేవతి వీధి, నాదు వీధి, శాలై రోడ్డు, చిత్రకుళం నార్త్, తచ్చి అరుణాచలం వీధి, అబ్రహాం వీధి, కచేరి రోడ్డు, కేశవపెరుమాళ్ సానతి వీధి, వీసీ గార్డెన్, ఆర్కే మఠ్ రోడ్డు, కొత్త వీధి, సోలప్పన్ వీధి, మందవెల్లి 5వ క్రాస్ వీధి, వెంకటేశ అగ్రహారం, నార్త్, ఈస్ట్ మాడ వీధులు, నల్లప్పన్ వీధి, ఆదాము వీధి, కుమరగురు వీధి, తిరువళ్లువర్‌పేట, జెత్ నగర్.

ఆవడి: మైత్తనాపల్లి పడశాలై వీధి, అంబేడ్కర్ వీధి, ఎంసీ రాజా వీధి, వళ్లువర్ వీధి, రాజీవ్‌గాంధీ నగర్ 1 నుంచి 8 వీధులు, బృందావన్ నగర్ 1 నుంచి 5 వీధులు, ఐజీపీ, సీఆర్‌పీఎఫ్, గారిసన్ ఇంజనీరింగ్ ఐఏఎఫ్.

29న ద్విచక్రవాహనాల వేలం


వాహనాలను పరిశీస్తున్న పోలీసు ఉన్నతాధికారులు

వేలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పోలీసుశాఖ ఆధీనంలో 5ఏళ్ళుగా వున్న నిషేధిత వాహనాలను వేలం వేయాలని జిల్లా ఎస్పీ మధివానన్ గురువారం ఆయా పోలీస్‌స్టేషన్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యం, వేలూరు నేతాజీ స్టేడియంలోని సుమారు 90 వాహనాలకు వేలంపాట నిర్వహించనున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. ఇందుకోసం ఈ నెల 29వ తేదీ ఉదయం 9 గంటలకు రూ.100 ఎంట్రన్స్ ఫీజు చెల్లించి, వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు. వేలంలో పాల్గొని వాహనాలను సొంతం చేసుకున్న వారికి రసీదు ద్వారా ఆ వాహనాలను అందించనున్నట్లు జిల్లా పోలీసు అధికారులు వెల్లడించారు.

రూ.18.93 కోట్లతో అయ్యప్పన్ తాంగల్ బస్‌స్టేషన్ పునరుద్ధరణ

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆధ్వర్యంలో పోరూర్ సమీపంలోని అయ్యప్పన్ తాంగల్‌లోని బస్‌స్టేషన్‌ను రూ.18.93 కోట్లతో పునరుద్ధరించనున్నారు. గురువారం ఉదయం ఈ పనులను రాష్ట్ర మంత్రులు టీఎం అన్బరసన్, పీకే శేఖర్‌బాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గృహ వసతి, నగరాభివృద్ధి శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ కాకర్ల ఉషా,సీఎండీఏ ప్రిన్సిపల్ అధికారి శివజ్ఞానం, జీసీసీ కౌన్సిలర్ హూంగుడి, పలువురు అధికారులుపాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కోర్సులకు 2.18 లక్షల దరఖాస్తులు

అడయార్, మే 22 (ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా సంవత్సరం 2025-26లో ఇంజనీరింగ్ కాలేజీలో ప్రవేశాల కోసం ఇప్పటివరకు 2.18 లక్షల మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు.ఈదరఖాస్తుల స్వీకరణ 7వతేదీనుంచి ప్రారంభమైంది. ప్లస్‌టూ మార్కుల జాబితా వెల్లడైన తర్వాత వీటిని స్వీకరిస్తున్నారు బుధవారం సాయంత్రం వరకు 2,18,019 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించేందుకు జూన్ ఆరో తేదీ సాయంత్రం 6 గంటల వరకు గడువు విధించారు.

● తూత్తుకుడి ఘటనకు ఏడేళ్లు ..
మృతులకు ప్రజల నివాళి

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి కాల్పుల ఘటనకు ఏడేళ్లు గడిచిన సందర్భంగా, మృతులకు ప్రజలు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. తూత్తుకుడి స్టెరిలైట్ కర్మాగారానికి వ్యతిరేకంగా 2018 మే 22వ తేది పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆ సమయంలో ర్యాలీలో పాల్గొన్న కొందరు ప్రభుత్వ ప్రజా ఆస్తులు ధ్వంసం చేస్తున్నారని పోలీసులు కాల్పులు జరుపడంతో, 13 మంది మృతిచెందగా, వంద మందికి పైగా గాయపడ్డారు. దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన ఈ ఘటన అనంతరం రాష్ట్ర ప్రభుత్వం స్టెరిలైట్ కర్మాగారానికి సీలు వేసింది. ఈ విషయమై దాఖలైన కేసులో రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులను సుప్రీంకోర్టు సమర్థించడంతో, స్టెరిలైట్ కర్మాగారం శాశ్వతంగా మూతపడింది. ఈ నేపథ్యంలో, తూత్తుకుడి ఘటనకు ఏడేళ్లు పూర్తయిన సందర్భంగా ర్యాలీ జరిగిన ప్రాంతాలు, కాల్పులు జరిగిన ప్రదేశాలు వీరపాండియాపురం మడత్తూర్, సిల్వర్‌పురం, ఫాతిమా నగర్, తోమయార్ ఆలయ వీధి, భూపాలరాయర్‌పురం, లయన్స్ టౌన్ తదితర ప్రాంతాల్లో ప్రజా సంఘాల నేతలు, ప్రజలు పాల్గొని, కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు.


మృతుల ఫొటోలకు నివాళులర్పిస్తున్న ప్రజలు

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

● తమిళనాడు హోటళ్ల సంఘం నిర్వాహకులు

వేలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు హోటల్స్ అసోసియేషన్, ఆహార నాణ్యత నిర్ణయ కమిషన్ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఆహార భద్రతపై హోటళ్ల యాజమానుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటళ్ల సంఘ అధ్యక్షుడు వెంకట సుబ్బు మాట్లాడుతూ, హోటళ్ల నిర్వాహణ విషయంలో నాణ్యమైన ఆహారాన్ని కస్టమర్లకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ జాయింట్ డైరెక్టర్ కణ్ణన్, డాక్టర్ పశుపతి, అంబూరుబాబు, వివిధ హోటళ్ల యాజమానులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు కలెక్టర్ అభినందన

వేలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా గుడియాత్తం గంగమ్మ ఆలయ జాతరలో చెత్త తొలగింపు పనుల్లో పాల్గొన్న పారిశుధ్య కార్మికులను కలెక్టర్ సుబ్బులక్ష్మి అభినందిస్తూ వారికి కార్పొరేషన్ తరుపున విందు భోజనాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, గత వారం రోజుల నుండి జరుగుతున్న గంగమ్మ జాతర ఉత్సవంలో సుమారు వంద టన్నుల మేరకు పేరుకుపోయిన చెత్తను ఒకే రాత్రిలో శుభ్రపరిచిన పారిశుధ్య కార్మికులను అభినందించాలన్నారు. మధ్యాహ్న 12 గంటలకు జరిగిన అన్నదాన కార్యక్రమంలో కలెక్టర్ స్వయంగా పారిశుధ్య కార్మికులకు ఆహారం వడ్డించారు.


పారిశుధ్య కార్మికులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం

● ఒకరి అరెస్ట్

వేలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా పేర్నాబట్టు సమీపంలో కర్ణాటక నుంచి వేలూరుకు మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా.. పేర్నాబట్టు సమీపంలోని వి.కోట రహదారిలోని చెక్‌పోస్టులో బుధవారం రాత్రి పోలీసులు ఓ కారు ఆపి, తనిఖీ చేశారు. ఆ కారులో ఉన్న 1,780 మద్యం ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోగా, ఆ కారులో వున్న ఇద్దరు వ్యక్తుల్లో ఒకడు పరారయ్యాడు. వీటిని అక్రమంగా తరలిస్తున్న పయాజ్ (41)ను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ విచారణలో కర్ణాటక రాష్ట్రం నుండి వేలూరుకు తరలించి అక్కడి స్థానికులకు విక్రయిస్తున్నట్లు తెలిపాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరారైన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.


మద్యం తరలిస్తున్న నిందితుడితో పోలీసులు

పోలీసు బందోబస్తు మధ్య టాస్మాక్ దుకాణం ప్రారంభం


మద్యం విక్రయాలు ప్రారంభించిన దృశ్యం - దుకాణం ముందు మోహరించిన పోలీసులు

తిరుత్తణి, మే 22 (ఆంధ్రజ్యోతి): పోలీసు బందోబస్తు నడుమ టాస్మాక్ దుకాణాన్ని గురువారం ప్రారంభించారు. తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సమీపం చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలోని పట్టాభిరామపురంలో కొత్తగా టాస్మాక్ దుకాణం ప్రారంభించారు. మద్యం దుకాణాన్ని వ్యతిరేకిస్తూ పలు రాజకీయ పార్టీలు, స్థానికులు ఆందోళన చేపట్టారు. ఆందోళన కారణంగా టాస్మాక్ దుకాణాన్ని మూసివేశారు. అయినా, స్థానికులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో, గురువారం మధ్యాహ్నం తిరుత్తణి డీఎస్పీ కందన్, సీఐ మధిఅరసన్, ఎస్ఐ కార్తీలతో పాటు సుమారు వంద మందికి పైగా పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు దుకాణం ప్రారంభించడంతో మద్యం ప్రియులు ఉత్సాహంగా మద్యం కొనుగోలు చేశారు. ఆందోళన చేపట్టిన రాజకీయ పార్టీల నేతలు, ప్రజలను పోలీసులు అడ్డుకున్నారు. ఎలాంటి చర్యలు చేపట్టిన టాస్మాక్ దుకాణం మూసేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్థానికులు తేల్చిచెప్పారు. కాగా, ఆందోళనల నేపథ్యంలో, టాస్మాక్ దుకాణం వద్ద కొద్దిరోజులు పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయాలని అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.

చేతులెలా వచ్చాయో ?

టాయిలెట్‌లో వేసి పసికందు హత్య ● యువతి అరెస్ట్

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): టాయిలెట్ వేసి పసికందు హతమార్చిన యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. అరియలూరు జిల్లా తిరుమానూరు సమీపం కండిరాతీర్థం గ్రామానికి చెందిన లారా అనే నిండు గర్భిణి అరియలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు బుధవారం ఉదయం వచ్చింది. ఆ సమయంలో, ఆమెకు పురిటి నొప్పులు రావడంతో, ఆమె వెంటనే ఆస్పత్రి ప్రాంగణంలోని టాయిలెట్‌లోకి వెళ్లి తలుపు వేసుకుంది. అక్కడ ఆడపిల్లను ప్రసవించిన లారా, పసికందును టాయిలెట్‌లో వేసి ఊపిరాడకుండా చేయగా, ఆ సమయంలో పసికందు ఏడుపుతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని టాయిలెట్ తలుపులు బద్దలుకొట్టగా, పసికందు మృతిచెంది కనిపించింది. సిబ్బంది ఇచ్చి సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని, లారాను అదుపులోకి తీసుకుని, అక్రమ సంబంధంతో జన్మించడంతో పసికందును లారా హతమార్చిందా? మరేదైనా కారణముందా? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు.

ఆరుకు చేరిన క్వారీ మృతులు

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): క్వారీలో రాళ్లు విరిగిపడిన ఘటనలో చికిత్స పొందుతున్న కార్మికుడు బుధవారం ఉదయం మృతిచెందడంతో, ఈ ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు పెరిగింది. శివగంగ జిల్లా సింగంపురి సమీపం మల్లకోట గ్రామంలోని రాళ్ల క్వారీలో ఈ నెల 20న 18 మంది కార్మికులు పనిచేస్తున్న నేపథ్యంలో, బండరాళ్ల మధ్య ఆరుగురు చిక్కుకున్నారు. వారిలో ఐదుగురు మృతిచెందగా, మైఖేల్ (42) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు

శ్రీలంక జైలు నుంచి 11 మంది జాలర్ల విడుదల

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్ల నుంచి విడుదల చేసిన 11 మంది జాలర్లు విమానంలో చెన్నై చేరుకున్నారు. గత జనవరిలో రామేశ్వరానికి చెందిన 11 మంది జాలర్లు సముద్రంలో చేపల వేటకు వెళ్లగా గస్తీ నౌకల్లో వచ్చిన శ్రీలంక నావికాదళం జాలర్లను అరెస్ట్ చేసి, రెండు ఫైబర్ పడవలు స్వాధీనం చేసుకుంది. జాలర్లను కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో, శ్రీలంకలోని భారత దౌత్యాధికారి కార్యాలయం చొరవతో జైళ్లలో ఉన్న జాలర్లను విడుదల చేస్తూ శ్రీలంక కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. జాలర్లను భారత దౌత్యాధికారి కార్యాలయానికి అప్పగించగా, అక్కడి నుంచి విమానంలో మంగళవారం రాత్రి చెన్నై చేరుకున్నారు. విమానాశ్రయంలో జాలర్లను ఆహ్వానించి మత్స్యశాఖ అధికారులు, ప్రత్యేక వాహనాల్లో వారి వారి గ్రామాలకు పంపించారు.

ఏనుగు దాడిలో వృద్ధురాలి మృతి

టి.నగర్, మే 22 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై సమీపం సోలాయారులో గురువారం వేకువజాము 3 గంటలకు ఓ ఇంటిలో అడవి ఏనుగు చొరబడి నిద్రపోతున్న మేరీ (77) అనే వృద్ధురాలిపై దాడి చేయడంతో ఆమె మరణించింది. ఆమెతోపాటు నిద్రపోతున్న దైవానై (75) అనే మరో వృద్ధురాలి గాయపడింది. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మేరీ మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. గాయపడిన దైవానైని ఆసుపత్రిలో చేర్చి చికిత్సలందిస్తున్నారు.


మృతి చెందిన మేరీ

రైలులో రూ.32 లక్షల కరెన్సీ స్వాధీనం


ఆర్పీఎఫ్ అధికారులు స్వాధీనం చేసుకున్న కరెన్సీ

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాంబళం రైల్వేస్టేషన్‌కు గురువారం రైలులో తరలించిన రూ.32 లక్షల కరెన్సీని స్వాధీనం చేసుకున్న ఆర్పీఎఫ్ అధికారులు మహిళతో పాటు ముగ్గురిని అరెస్టు చేశారు. హైదరాబాదు నుండి పుదుచ్చేరికి బయలుదేరిన పాండి ఎక్స్‌ప్రెస్‌లో పెద్దమొత్తంలో కరెన్సీని తరలిస్తున్నట్లు ఆర్పీఎఫ్ కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, మాంబళం రైల్వేస్టేషన్‌లో నిఘా వేసి, పాండి ఎక్స్‌ప్రెస్ నుండి దిగిన ముగ్గురిని ఆపి ప్రశ్నించారు. రూ.32 లక్షల కరెన్సీని నగదు మార్పిడి కోసం ఒక రాష్ట్రం నుండి మరో రాష్ట్రానికి చట్టవిరుద్ధంగా తరలించిన వైనం వెలుగు చూసింది. దీంతో మహిళతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకున్న ఆర్పీఎఫ్ అధికారులు వారిని సీబీఐకు అప్పగించారు.

ఫెయిలైన కుమారులు

● మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

పెరంబూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): పబ్లిక్ పరీక్షల్లో ఇద్దరు కుమారులు ఫెయిలవడం తట్టుకోలేక తండ్రి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నామక్కల్ జిల్లాలో చోటుచేసుకుంది. తిరుచెంగోడు సమీపం కుప్పాండంపాళయం పంచాయతి వన్నియర్‌కోయిల్ మేడు ప్రాంతానికి చెందిన కపిల్ ఆనంద్ (41) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు నిత్య అనే భార్య, హరిరంజిత్, విఘ్నేష్ అనే ఇద్దరు కుమారులున్నారు. తిరుచెంగోడు ప్రభుత్వ బాలుర మహోన్నత పాఠశాలలో హరిరంజిత్ ప్లస్ టూ, అదే పాఠశాలలో విఘ్నేష్ 10వ తరగతి చదివారు. ఇటీవల జరిగిన పబ్లిక్ పరీక్షల్లో ఇద్దరూ ఉత్తీర్ణులు కాలేదు. తాను చదువుకొనే అవకాశం లేకపోయినా, తన కుమారులు బాగా చదువుకోవాలని ఆశపడినా, ఇద్దరు ఫెయిల్ కావడంతో కపిల్ ఆనంద్ మానసికంగా కృంగిపోయారు. కొంతకాలంగా ఎవరితో మాట్లాడకుండా ఒంటరిగా ఉంటున్న కపిల్ ఆనంద్, బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న తిరుచెంగోడు గ్రామీణం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కలెక్టర్ ఆధ్వర్యంలో జమాబంది


ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): గుడియాత్తంలోని 6వ డివిజన్‌లో కలెక్టర్ సుబ్బులక్ష్మి సారథ్యంలో గురువారం ఉదయం జమాబంది కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమ్ములు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. 1,434వ జమాబంది కార్యక్రమంలో పలు శాఖలకు సంబంధించిన సమస్యలను ప్రజలు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. అనంతరం ప్రజల నుండి ఎమ్మెల్యే అమ్ములు, కలెక్టర్ సుబ్బులక్ష్మి వినతిపత్రాలను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గుడియాత్తం డీఎంకే అధ్యక్షుడు సౌందరరాజన్, రూరల్ అభివృద్ధి డైరెక్టర్ సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు నగరంలో తాగునీటి సరఫరా నిలిపివేత

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ప్రధాన తాగునీటి పైపుల అనుసంధానం కారణంగా ఐదు జోన్లలో 24 గంటల పాటు తాగునీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు గురువారం చెన్నై మెట్రో వాటర్ బోర్డు అధికారులు ప్రకటించారు.తండయార్‌పేట, పురుషైవాక్కం,పెరియమెట్టు, షావుకారుపేట, ఎగ్మూర్, చింతాద్రిపేట, ఓటేరి, అయినావరం,పెరంబూరు, కీల్పాక్కం, కెల్లీస్, విల్లివాక్కం, ట్రిప్లికేన్ ప్రాంతాల్లో వచ్చే శనివారం ఉదయం 8 గంటల నుండి ఆదివారం ఉదయం 8 గంటల వరకు కొలాయిల ద్వారా తాగునీటి సరఫరా ఉండదని ప్రకటించారు.ఈప్రాంతాలకు చెందిన ప్రజలకు ట్యాంకర్ లారీలద్వారా తాగునీటి సరఫరా ఉంటుందని అధికారులు తెలిపారు.

ఆధునిక డ్రోన్ తయారీలో ఎంజీఆర్ వర్సిటీ విద్యార్థుల ప్రతిభ

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక మధురవాయల్‌లోవున్న డాక్టర్ ఎంజీఆర్ వర్సిటీ విద్యార్థులు వ్యవసాయానికి ఉపయోగించే ఆధునిక డ్రోన్ రూపొందించి తమ ప్రతిభ చాటుకున్నారు. ఎంజీఆర్ వర్సిటీ, బెంజ్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా మూడేళ్ళ పాటుచేసిన పరిశోధనల ఫలితంగా రూపుదిద్దుకున్న డ్రోన్ పరిచయ కార్యక్రమంలో వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ఏసీ షణ్ముగం, ఛైర్మన్ ఏసీఎస్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు. రైతులు పండించే పంటలు కీటకాల బారిన పడకుండా పంటను కాపాడుకునేలా మందులు, ఎరువులు చల్లేందుకు అనుకూలంగా విద్యార్థులు హైటెక్ టెక్నాలజీతో డ్రోన్ తీర్చిదిద్దారు. ఇదే కాకుండా భారత సైన్యానికి అనుకూలంగా డ్రోన్‌ను రూపొందించి మిలటరీకి అందజేయనున్నట్లు చాన్స్‌లర్ ఏసీ షణ్ముగం తెలిపారు.



గరుడాళ్వార్ సహా ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవారు



ఆలయ రాజగోపురం



గరుడ వాహనంపె నంబెరుమాళ్ రాతి విగ్రహం

సకల సంపదలనిచ్చే

నాచ్చియార్ కోవిల్

- తాళాల గుత్తితో దర్శనమిచ్చే తాయార్
- రాతి గరుడోత్సవాలు జరిగే ఏకైక క్షేత్రం

టి.నగర్, ఆంధ్రజ్యోతి

అష్టోత్తర వైష్ణవ దివ్యదేశాల్లో తంజావూరు జిల్లా కుంభకోణం సమీపంలోని నాచ్చియార్ కోవిల్‌లో ఉన్న వంజులవళ్ళి తాయార్ సమేత శ్రీనివాస పెరుమాళ్ కోయిల్ 14వ దివ్యదేశంగా విరాజిల్లుతోంది. ఈ క్షేత్రంలో ప్రతియేటా నిర్వహించే 'కల్ (రాతి) గరుడ సేవ ప్రఖ్యాతి చెందింది. ఈ క్షేత్రంలో తాయార్ నంబెరుమాళ్ కంటే కాస్త ముందుండి భక్తులను అనుగ్రహిస్తున్నారు. చేతిలో చిలుక, నడుమున తాళాలగుత్తి కలిగి ఉండటంతో ఈ క్షేత్రం సర్వాధికారాలు తాయారుకే ఉన్నాయని స్పష్టమవుతుంది. తిరుమంగైఆళ్వారు ఈ క్షేత్రం మహిమలను కీర్తించి మంగళాశాసనమొనర్చారు.





ఆలయ ముఖమండపం - ఆలయతీర్థకొలను

స్థలపురాణం...

పూర్వం పెరుమాళ్‌పై అపారమైన భక్తితో మేధావిమహర్షి నంబెరుమాళ్‌ను తన అల్లుడిగా చేసుకోవాలని ఆరాటపడుతుండే వారు. మహాలక్ష్మి తన కుమార్తెగా అవతరించాలని కోరుకున్నారు. ఆ కోరిక నెరవేరేందుకు వంజులవృక్షం దిగువన తపస్సు చేశారు. ఆ మునీశ్వరుడి తపస్సును మెచ్చి మహాలక్ష్మి సంతోషంగా పంగుణి ఉత్తిర నక్షత్ర దినాన ఆయన తపస్సు చేస్తున్న వృక్షానికి చేరువగా స్వర్ణమేనితో పసికందుగా ఆవిర్భవించారు. పసిబిడ్డ ఏడుపువిని మేధావి మహర్షి తపస్సు నుంచి లేచి ఆ బిడ్డను చూసి ఆనందించి వంజువళ్ళి అని నామకరణం చేసి తన ఆశ్రమంలోనే అల్లారుముద్దుగా పెంచారు. భూలోకంలో అవతరించిన మహాలక్ష్మిని పరిణయమాడేందుకు తిరుమాళ్ ఐదు ఆకారాల్లో (శంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, పురుషోత్తముడు, వాసుదేవుడు) ఎనిమిది దిక్కులా అన్వేషించారు. తిరుమాలుడి వెంటే వచ్చిన గరుడాళ్వార్ తాయర్ ఉన్న స్థలాన్ని గుర్తించి చెబుతారు. ఆ మేరకు పెరుమాళ్ మేధావి మహర్షి ఆశ్రమానికి చేరుకుని మంజులవళ్ళిని పరిణయమాడేందుకు వచ్చానని తెలపగా, తన కుమార్తె ఆదేశాలకు కట్టుబడి నడిచినట్లయితే (అమ్మవారికి అధిక ప్రాధాన్యమివ్వటం) ఆమెనిచ్చి పెళ్ళి చేస్తానని మహర్షి షరతు విధించారు. దానికి స్వామివారు అంగీకరించడంతో గరుడాళ్వార్ సమక్షంలో పెరుమాళ్, వంజులవళ్లి వివాహం అత్యంత వైభవంగా జరిగింది. ఆ సందర్భంగా పెరుమాళ్ మేధావి మహర్షితో తానీ క్షేత్రంలో సతీదేవి ఆదేశాలకు కట్టుబడి ప్రవర్తిస్తానని కనుక గరుడాళ్వారే ముందుగా భక్తులను అనుగ్రహిస్తారని తెలిపారు. గరుడాళ్వార్ అంగీకరించి ఈ క్షేత్రంలో ప్రధానమూర్తిగా అవతరించారు. అమ్మవారి పేరుతోనే ఈ క్షేత్రాన్ని 'నాచ్చియార్ కోవిల్' అని పిలుస్తున్నారు.

ఆలయ వైభవం...

నాయన్మార్లలో ఒకరైన కోచ్చచెంగణార్ కలలో ప్రత్యక్షమైన పెరుమాళ్ తనకు ఆలయాన్ని నిర్మించమని ఆదేశిస్తారు. ఆ ప్రకారమే శివాలయాన్ని తలపించేలా యాళులతో, మాడకోవిల్ రూపంలో ఆయన ఆలయాన్ని నిర్మించారు. 5 ఎకరాల విస్తీర్ణంలో 75 అడుగులు, ఐదంతస్థుల రాజగోపురం నిర్మితమైంది. పంచ ప్రాకారాలు కలిగిన ఈ ఆలయం క్రీ.శ. 5వ శతాబ్దంలో కొచ్చచెంగణాన్ చోళ చక్రవర్తి నిర్మించారు. ఇదొక మాడ కోవిల్ (ఏనుగు సులువుగా పైకి ఎక్కలేని ఆలయం). మూలవర్ల సన్నిధిని చేరటానికి 21 మెట్లున్నాయి. ప్రాకారంలో చక్రతాళ్వార్‌కు దిగువ నవగ్రహాలు, పైభాగాన దశావతారాల శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. గరుడాళ్వార్ సన్నిధికి సమీపంలో అష్టోత్తర శత దివ్యదేశాల ఉత్సవర్లు వరుసగా దర్శనమిస్తారు. ఈ ఆలయంలో ప్రతినెలా శ్రవణానక్షత్రం రోజున ప్రత్యేక తిరుమంజనాలు నిర్వహిస్తారు. మార్గళి, పంగుణి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. వీటన్నింటికి మించి రాతి గరుడ సేవ తిలకించేందుకు వేలాదిమంది భక్తులు తరలివస్తారు.

ముద్రా దానం...

పూర్వం నీలుడు అనే సామంతరాజు పెరుమాళ్‌పై అపారమైన భక్తితో తన సంపదనంతా దైవ కార్యానికే వెచ్చించేవాడు. ఇంత చేసినా నీలుడు వైష్ణవుడు కాకపోవటం అందరూ అతడిని ఏవగించుకునేవారు. దీంతో కలత చెందిన నీలుడు స్వామివారి దగ్గర తన బాధనంతా చెప్పుకుని ప్రార్థించేవాడు. అతడి ప్రార్థనను మన్నించి పెరుమాళ్ వైష్ణవాచార్యుల వేషంలో వచ్చి నీలుడికి ముద్రాదానం చేశారు. భక్తుడిని అనుగ్రహించేందుకు స్వామివారు ఆచార్యుడిగా ఈ ప్రాంతానికి రావటం వల్ల స్వామివారు చతుర్భుజుడిగా కాకుండా ద్విభుజుడిగా దర్శనమిస్తున్నారు. తనకు సంపూర్ణ వైష్ణవత్వాన్ని కలిగించిన ఈ క్షేత్రంలోని పెరుమాళ్‌ను వందకుపైగా పాశురాలతో కీర్తించి, స్వామివారిని 'నంబి' అని సంబోధించి మంగళాశాసనమొనర్చారు.

శిలా గరుడ సేవ...

నాచ్చియార్ కోవిల్‌లో గరుడాళ్వార్ ప్రత్యేక సన్నిధుల్లో దేహంపై నవ నాగదేవతలను కలిగి భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఈ స్వామివారికి రోజూ ఆరుకాల పూజలు చేస్తారు. ఊరేగింపు సమయాల్లో మూలవర్లుగా ఉన్న రాతి (శిలా) గరుత్మంతుడి (4 టన్నుల బరువు కలిగిన విగ్రహం)పైనే స్వామి, అమ్మవారు ఆశీనులవుతారు. ఈ శిలా గరుత్మంతుడిని గర్భాలయం నుండి వెలుపలకు మోసుకుని తెస్తారు. ఈ శిలా విగ్రహాన్ని 128 (అటు 64, ఇటు 64) మంది మోయటం విశేషం. ఊరేగింపు పూర్తయిన తర్వాత శిలా గరుత్మంతుడిని మోసే వారి సంఖ్య ఆ ప్రకారమే తగ్గుతూ చివరకు నలుగురు ఆ విగ్రహాన్ని గర్భాలయంలోకి తరలిస్తారు.

అమ్మవారికే అగ్రతాంబూలం...

మేధావి మహర్షికి వాగ్దానం చేసినట్లు పెరుమాళ్ ఈ క్షేత్రంలో తన సతీదేవికే అధిక ప్రాధాన్యం ఇస్తూ భక్తులను అనుగ్రహిస్తున్నారు. ఆ మేరకు తాయార్‌కు ప్రాధాన్యం ఇచ్చేలా గర్భాలయం నిర్మితమైంది. గర్భాలయంలో పెరుమాళ్ కంటే కాస్త ముందుగా తాయర్ దర్శనమిస్తారు. ఊరేగిస్తున్న సమయాల్లోనూ తాయార్ వెనుకనే స్వామివారు వెళ్తుంటారు. అమ్మవారికే మొదట తిరుమంజనం జరుగుతుంది. ఈ ఆలయాన్ని దర్శించుకుంటే వివాహం, సంతానం కలుగుతాయని వైష్ణవ పండితులు చెబుతారు.



మేధావి మహర్షి విగ్రహం

మూలవర్ల నామధేయం : తిరునరయూరు నంబి
ఉత్సవమూర్తి : ఇడర్‌కడుత్త తిరువాళన్, **తాయార్ నామం :** వంజులవళ్ళి
స్థలవృక్షం : వకుళ వృక్షం, **విమానం :** హేమ విమానం
తీర్థం : మణిముత్తా, శంకర్షణం, ప్రద్యుమ్నం, అనిరుద్ధం, శాంబతీర్థం

ఎలా వెళ్ళాలి?

రాజధాని నగరం చెన్నై సహా పలు ప్రధాన నగరాల నుండి తంజావూరు జిల్లా కుంభకోణం నగరానికి బస్సులు వెళతాయి. కుంభకోణంకు పది కిలోమీటర్ల దూరంలో తిరువారుకు వెళ్లే మార్గంలో నాచ్చియార్ కోవిల్ ఉంది. కుంభకోణం బస్టాండు నుండి టవున్ బస్సులు, ఆటోలు, టాక్సీలలో ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు. ఈ ఆలయాన్ని ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మళ్ళీ సాయంత్రం 4.30 నుండి రాత్రి 9 గంటల వరకు తెరచి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.



వీఐటీతో గ్లెనిగల్స్ హాస్పిటల్ భాగస్వామ్యం

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సంరక్షణ పర్యావరణ వ్యవస్థ మార్పే ఉద్దేశంతో వేలూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ), గ్లెనిగల్స్ హాస్పిటల్స్ చెన్నై ఆర్టీఫిషియల్ ఇంటెలిజెన్స్, న్యూరో సైన్సెస్‌పై పరిశోధన, నూతన ఆవిష్కరణలపై సహకరించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ మేరకు గురువారం గ్లెనీగల్స్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ నాగేశ్వరరావు, వీఐటీ ప్రొ వైస్‌ఛాన్సలర్ డాక్టర్ టి.త్యాగరాజన్ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్ నాయక్, డాక్టర్ సంగీత, డాక్టర్ నటేశన్ దామోదరన్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ గణేశన్, డాక్టర్ సుకన్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశంలో సాంకేతికత, ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ మధ్య బలమైన బంధం ఈ సమయంలో అవసరమన్నారు.

- ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవం...

స్కైలైన్ త్రివర్ణ ప్రకాశం



చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవాన్ని (మే 21) పురస్కరించుకుని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ డీఆర్‌పీ షోళింగనల్లూరు నుంచి ఆడంబాక్కం వరకు వున్న తన ఐదు ఐకానిక్ రెసిడెన్షియల్ టవర్లను త్రివర్ణ రంగుల్లో విద్యుద్దీపాలతో అలంకరించింది. దీని ద్వారా భారత సాయుధ దళాలకు ఉత్తేజకరమైన నివాళులర్పించింది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ఇది కేవలం దృశ్యనివాళి మాత్రమే కాదని, ఐక్యత, కృతజ్ఞతకు చిహ్నమన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొరట్టూరు అగ్రహారంలోని 'ఆంధ్ర కళా స్రవంతి' ఆధ్వర్యంలో గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకుని హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి కార్యాలయ ప్రాంగణంలోని రామాలయం, హనుమంతుడి సన్నిధిని పండ్లు, పూలు, మామిడి, అరటి తోరణాలతో అలకరించి వేడుకలు నిర్వహించారు. సుసర్ల కుటుంబ శాస్త్రి నేతృత్వంలోని బృందం హోమం, పూర్ణాహుతి నిర్వహించారు. హనుమంతుడికి 108 కేజీల వడమాల, తమలపాకులు, వెన్న అలంకరణతో అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం 108 భిన్నమైన రాగాలతో హనుమాన్ చాలీసాను పఠించారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు రామాంజనేయ నామ సంకీర్తన మండలి, హిందూ ధర్మపరిరక్షణ ట్రస్ట్ బృందంచే భక్తి సంగీత విభావరి జరిగింది.



చాలీసా పారాయణం చేస్తున్న ఆంధ్ర కళాస్రవంతి నిర్వాహకులు, కళాకారులు

ఆవిన్ పాలను అధిక ధరకు విక్రయించలేదు

- మంత్రి మనో తంగరాజ్

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆవిన్ పాలను అధికధరలకు విక్రయించలేదని రాష్ట్ర పాడిపరిశ్రమలశాఖ మంత్రి మంత్రి మనో తంగరాజ్ స్పష్టం చేశారు. నందనంలోని ఆవిన్ హౌస్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి మనో తంగరాజ్ జ్యోతి వెలిగించి, 60 ఫ్రీజర్ బాక్సులను ఆవిన్ డీలర్లు, పాల సహకార సంఘాలకు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రప్రభుత్వ నిర్వహణలోని ఆవిన్ సంస్థ నాణ్యమైన పాలను వినియోగదారులకు పంపిణీ చేయడం, పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. పాలతో పాటు ఆవిన్ ఉత్పత్తులను విక్రయించేందుకు ఇప్పటికే 10వేల మందికిపైగా డీలర్లను నియమించామని, ఈ సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఆవిన్ ఉత్పత్తుల నాణ్యతపై ప్రత్యేక దృష్టిసారించినందున వీటి అమ్మకాలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. ఆవిన్ పాలు, ఆవిన్ ఉత్పత్తులను అధికధరలకు విక్రయించడంలేదని, ఎమ్మార్పీ ధర కంటే అధికంగా విక్రయించినట్లేతే ప్రజలు ఫిర్యాదు చేయవచ్చున్నారు. ప్రస్తుతం రోజుకు 30.5 లక్షల లీటర్ల పాలను రైతుల నుండి కొనుగోలు చేసి, వారికి గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో పాడిపరిశ్రమలు, పశుసంవర్ధకశాఖ కార్యదర్శి సుబ్బయ్యన్, ఆవిన్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నాదురై తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మనో తంగరాజ్

ఐదేళ్ల చిన్నారికి విజయవంతంగా కాలేయ మార్పిడి

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): కాలేయమార్పిడి శస్త్రచికిత్సలో ఖ్యాతి గాంచిన రేలా హాస్పిటల్. ఐదేళ్ల బాలుడికి రోబోటిక్ ప్లాట్‌ఫామ్‌లో కాలేయ మార్పిడి నిర్వహించి ప్రపంచంలోనే తొలి ఆసుపత్రిగా రికార్డుల కెక్కింది. ఈ వివరాలను ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ మహమ్మద్ రేలా, సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ రాజేష్ రాజలింగం, డైరెక్టర్ డాక్టర్ నరేష్ షణ్ముగం గురువారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో వివరించారు. యూరియా సైకిల్ డిఫెక్ట్ అనే అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. రక్తంలో అమ్మోనియా హానికరంగా పేరుకుపోయేది. రోజురోజుకు బాలుడి పరిస్థితి విషమిస్తుండడంతో కాలేయమార్పిడి చేయాలని వైద్యులు నిర్ణయించారు. అతడి తల్లి కాలేయం దానం చేసేందుకు ముందుకు రావడంతో రేలా ఆస్పత్రి బృందం ఏప్రిల్ 22వ తేదీ రోబోటిక్ ప్లాట్‌ఫామ్ ద్వారా కాలేయ మార్పిడిని విజయవంతంగా నిర్వహించింది. సాధారణ కాలేయ మార్పిడికి రోగి 14 నుంచి 21 రోజుల పాటు ఆస్పత్రిలో ఉండాలి. అయితే రోబోటిక్ సర్జరీ చేయడంతో ఐదు రోజులకే బాలుడు పూర్తిగా కోలుకుని డిశ్చార్జ్ అయ్యాడు. దీని గురించి ప్రొఫెసర్ రేలా మాట్లాడుతూ... ప్రపంచంలో మొదటిసారిగా పిల్లల కాలేయమార్పిడి రోబోటిక్ ప్లాట్‌ఫామ్ ద్వారా విజయవంతంగా నిర్వహించామన్నారు. ఇది శస్త్రచికిత్స రంగంలోనే ఒక ప్రధాన మైలురాయిగా ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా బాలుడి తల్లిదండ్రులు మహమ్మద్ రేలా బృందానికి కృతజ్ఞతలు తెలపడంతో పాటు సత్కరించారు.



రేలా ఆస్పత్రి బృందాన్ని సత్కరిస్తున్న బాలుడి తల్లిదండ్రులు

ఏర్వాడీలో నేత్రపర్వంగా చందనోత్సవం

పోటెత్తిన భక్తజనం

ప్యారీస్, మే 22 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా కీల్‌కరై సమీపంలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏర్వాడీ దర్గా చందనోత్సవం నేత్రపర్వంగా సాగింది. ఏర్వాడీ కుతుబ్ సుల్తాన్ సయ్యద్ ఇబ్రహీం షాహిద్ భాషా దర్గాకు ఘన చరిత్ర ఉంది. అక్కడ నిర్వహించే చందనోత్సవంలో సర్వ మతాల ప్రజలు పాల్గొంటారు. ఈ ఏడాది 851వ చందనోత్సవం గత నెల 29న ఇస్లాం మతగురువుల ప్రత్యేక ప్రార్థనలతో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దర్గా, పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈ నెల 8వ తేదీ సాయంత్రం దర్గా ప్రాంగణంలో జెండా స్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం ఏనుగు, గుర్రం, ఒంటెలపై పతాకాన్ని ఊరేగించి రాత్రి 7 గంటలకు ఏర్వాడీ దర్గా నిర్వాహకులు పతాకాన్ని ఆవిష్కరించారు. ఆ రోజు నుండి ప్రతిరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధాన కార్యక్రమమైన గంధ పాత్ర ఊరేగింపులో తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. బుధవారం సాయంత్రం దర్గా ప్రాంగణం నుండి ప్రారంభమైన గంధ పాత్ర ఊరేగింపు గురువారం ఉదయం వరకు జరిగింది. రద్దీలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుల సాయంతో దర్గా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



గంధం పాత్ర ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చిత్రజ్యోతి

ఏఐ టెక్నాలజీని చూసి భయపడొద్దు

- కమల్ హాసన్



'థగ్‌లైఫ్' ప్రచార కార్యక్రమంలో చిత్ర బృందం

కృత్రిమ మేథ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ - ఏఐ)ను చూసి భయపడాల్సిన అవసరం లేదని అగ్రనటుడు కమల్ హాసన్ పేర్కొన్నారు. మణిరత్నం దర్శకత్వంలో తాను హీరోగా నటించిన 'థగ్ లైఫ్' మూవీ వచ్చే నెల 5వ తేదీ విడుదలకానున్న నేపథ్యంలో చిత్ర బృందం ప్రమోషన్ కార్యక్రమాలను ముమ్మరం చేసింది. తాజాగా జరిగిన ఓ కార్యక్రమంలో కమల్ హాసన్ మాట్లాడుతూ, 'ఏఐ టెక్నాలజీ గురించి లోతుగా తెలుసుకునేందుకు అమెరికా వెళ్లాను. అక్కడకు వెళ్లాక అది మనకంటే చాలా పెద్దది అని. దాన్ని అర్థం చేసుకోకుండా ముట్టుకోకూడదని గ్రహించాను. ఈ టెక్నాలజీని ఉపయోగించేవారు చాలా మంది ఉన్నారు. కానీ, సినిమా విషయానికి వస్తే మాత్రం అది ఇంకా ప్రారంభ దశలోనే ఉంది. ఒక విశాలమైన ప్రదేశం. మనందరి జీవితాల్లో ఏఐ ఉంటుంది. దాన్ని చూసి భయపడాల్సిన అవసరం లేదన్నారు. కాగా 'థగ్‌లైఫ్' గురించి ఆయన మాట్లాడుతూ, 'నాయకన్' మూవీ తర్వాత మణిరత్నంతో కలిసి నటిస్తున్నాను. అప్పటి కంటే ఇపుడు మేమిద్దం ఎంతో అనుభవాన్ని గడించాం. 'నాయకన్'లో నటించిన కమల్, ఆ చిత్రానికి దర్శకత్వం వహించిన మణిరత్నం ఇపుడు లేరు. ఒకే చోట ఉండకుండా ముందుకుసాగడం ఎంతో గర్వంగా ఉంది. దర్శకత్వంలో ఏ స్థాయికి చేరుకోవాలని భావించారో, ఆ స్థాయికి మణిరత్నం వచ్చారు. 'నాయకన్' ఛాయలు లేకుండా 'థగ్ లైఫ్' ఉండాలన్నదే మా ఇద్దరి ప్రయత్నం. అందులో విజయం సాధించామని భావిస్తున్నా' అని పేర్కొన్నారు.

సిమ్రన్ సంతోషం



సీనియర్ నటి సిమ్రన్ ఇపుడు తెగ సంతోషపడిపోతున్నారు. ఆమె నటించిన చిత్రాలు వరుసగా హిట్ కావడమే ఇందుకు కారణం. నటిగా రీ ఎంట్రీ ఇచ్చిన తర్వాత కోలీవుడ్‌లో సిమ్రన్ నటించిన 'అంథగన్', 'టూరిస్ట్ ఫ్యామిలీ' వంటి చిత్రాల్లో నటించగా, అన్నీ విజయాన్ని సాధించాయి. ఈ సినిమాల్లో ఆమె పాత్రలకు ప్రేక్షకులు బ్రహ్మరథంపట్టారు. ప్రస్తుతం ఆమె హీరోయిన్‌గా 'ది లాస్ట్ వన్' అనే చిత్రంలో నటించారు. ఆమె భర్త, నిర్మాత హర్రర్ థ్రిల్లర్ మూవీగా రూపొందించారు. ప్రస్తుతం ఆమెకు పలు ఆఫర్లు వస్తున్నప్పటికీ ఆ చిత్రాల్లో తన పాత్ర ఎంపికపై జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు వెళ్తున్నారు. కాగా, గతంలో సిమ్రాన్ భర్త ఒక చిత్రంలో నటించారు. అది బాక్సాఫీస్ వద్ద బోల్తాపడటంతో ఆ తర్వాత నటించడం మానేశారు.

డిసెంబరులో 'జైలర్-2' షూటింగ్ పూర్తి

- రజనీకాంత్



నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'జైలర్-2' షూటింగ్ డిసెంబరు నాటికి పూర్తి అవుతుందని రజనీకాంత్ తెలిపారు. ఈ మూవీ చిత్రీకరణలో భాగంగా తన కేరళ షెడ్యూల్ పూర్తి చేసుకుని గురువారం నగరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడుతూ, 'జైలర్ మూవీ షూటింగ్ ఎలాంటి అవాంతరాలు లేకుండా సాఫీగా సాగిపోతోంది. ఈ యేడాది డిసెంబరు చివరినాటికి చిత్రీకరణ పూర్తి చేసుకుంటుంది. సినిమా చాలా బాగా వస్తోంది' అని అన్నారు. ఆయన నటించిన 'జైలర్'కు రెండో భాగంగా ఇది ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇదిలావుండగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వం వహించిన 'కూలీ' చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులు జరుపుకుంటున్న విషయం తెల్సిందే.

మళ్ళీ వాయిదా పడిన 'పడై తలైవన్'

దివంగత నటుడు కెప్టెన్ విజయకాంత్ తనయకుడు షణ్ముగ పాండియన్ హీరోగా నటించిన 'పడై తలైవన్' మూవీ ఈ నెల 23వ తేదీ విడుదలకావాల్సి ఉండగా అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నట్టు మూవీ మేకర్స్ గురువారం అధికారికంగా వెల్లడించారు. ఏఐ టెక్నాలజీ సాయంతో విజయకాంత్ ప్రత్యేక పాత్రను డిజైన్ చేశారు. ఇళయరాజా సంగీతం సమకూర్చగా, ఏనుగు, ఫారెస్ట్ నేపథ్యంలో భారీ యాక్షన్ మూవీగా తెరకెక్కించారు. ఇప్పటికే ట్రైలర్ రిలీజ్ కాగా మంచి స్పందన వచ్చింది. ఇదిలావుంటే, మూవీని సంక్రాంతికి విడుదల చేయాలని భావించినప్పటికీ సాధ్యపడలేదు. రెండోసారి మే 23వ తేదీ విడుదల చేసేందుకు అన్ని ఏర్పాట్లుచేశారు. అయినా కూడా వాయిదా పడింది. ఈ విషయంపై హీరో షణ్ముగపాండియన్ తన ట్విట్టర్ ఖాతాలో ఓ పోస్ట్ చేశారు 'ఈ నెల 23వ తేదీన విడుదల చేయడానికి ప్లాన్ చేసిన 'పడై తలైవన్' మూవీని థియేటర్ల కేటాయింపు కారణంగా సమస్య తలెత్తింది. దీంతో తాత్కాలికంగా వాయిదా వేశాం. తదుపరి విడుదల తేదీన తర్వాత వెల్లడిస్తాం. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాం' అని పేర్కొన్నారు.



'పడై తలైవన్'లో షణ్ముగ పాండియన్

ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు



ప్రసన్నాంజనేయ విగ్రహం వద్ద ప్రసాదాలు పంపిణీ చేస్తున్న అదనపు ఈవో వెంకయ్య చౌదరి


హనుమజ్జయంతి సందర్భంగా గురువారం తిరుమలలోని బేడి ఆంజనేయస్వామి ఆలయంలో, మొదటిఘాట్‌రోడ్డులోని ఏడోమైలు ప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించించారు. బేడి ఆంజనేయస్వామికి అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించింది. మధ్యాహ్నం ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద వేద మంత్రోచ్చరణలు, మేళతాళాల నడుమ ప్రత్యేక పూజలు, ఆస్థానం నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాల పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు. జపాలి ఆంజనేయస్వామికి టీటీడీ తరుపున ఛైర్మన్ బీఆర్ నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల అనంతరం అర్చకులు సింధూర వస్త్రంతో ఛైర్మన్‌ను సత్కరించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



జపాలి ఆంజనేయస్వామికి పట్టువస్త్రాలను తీసుకువస్తున్న బీఆర్ నాయుడు

శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

- మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.24 కోట్లు
- బుధవారం దర్శించుకున్న భక్తులు: 80,964
- తలనీలాలు సమర్పించినవారు: 32,125

సత్యవేడు శాసనసభ్యుడు కోనేటి ఆదిమూలం రాజకీయ భవిష్యత్తు త్రిశంకు స్వర్గంలోనే ఉంది. ఎమ్మెల్యేగా కొనసాగుతున్న ఆయన మీద టీడీపీ సస్పెన్షన్ మాత్రం గత సెప్టెంబరు నుంచీ కొనసాగుతోంది. ఇటీవల పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సత్యవేడు పర్యటనతో అటోఇటో తేలిపోతుందని అందరూ అనుకున్నా.. అటువంటిదేమీ జరగలేదు. నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు మాత్రం దిక్కుతోచని స్థితిలోనే ఉన్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సత్యవేడు టీడీపీ నాయకుడెవరు?



- అయోమయంలో ఆదిమూలం భవితవ్యం
- సస్పెన్షన్‌లోనే ఎమ్మెల్యే
- స్పష్టత ఇవ్వని నారా లోకేశ్
- దిక్కుతోచని స్థితిలో టీడీపీ శ్రేణులు

ఆది నుంచీ వివాదాలు

వ్యక్తిత్వపరంగా ఎలాంటి లౌక్యం తెలియని రాజకీయ నాయకుడిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలానికి పేరుంది. దాపరికం లేకుండా ముక్కుసూటిగా మాట్లాడే అలవాటుకు తోడు ఆవేశపరుడన్న ముద్ర ఉంది. వీటన్నిటికీ మించి ఎవరినీ లెక్కచేయరని సత్యవేడు రాజకీయాల్లో ఆయన గురించి తెలిసిన వారు చెబుతుంటారు. వీటి కారణంగా ఆయన గత వైసీపీ ప్రభుత్వంలో కూడా సొంత పార్టీ నేతల నుంచీ వ్యతిరేకత ఎదుర్కొన్నారు. మరోవైపు కుటుంబ సభ్యుల్లో ఒకరి దూకుడు ఆయనకు మరిన్ని చిక్కులు తెచ్చి పెట్టాయి. గత ఎన్నికల్లో తొలుత వైసీపీ అధిష్ఠానం సత్యవేడు అసెంబ్లీ టికెట్ నిరాకరించినా ప్రత్యామ్నాయంగా తిరుపతి ఎంపీ టికెట్ ప్రకటించింది. తర్వాత నిర్ణయం మార్చుకుని సత్యవేడు టికెట్‌నే ఖరారు చేసింది. అయితే పార్టీ అధిష్ఠానం తీరుతో తీవ్ర మనస్తాపానికి లోనైన ఆయన ఏకంగా పార్టీపైనే తిరుగుబాటు చేశారు. తన నియోజకవర్గంలో అక్రమాలకు మంత్రి పెద్దిరెడ్డే కారణమని బహిరంగ ఆరోపణలు చేశారు. ఆయనను నేరుగా సవాల్ చేశారు. ఆపై టీడీపీలో చేరి అసెంబ్లీ టికెట్ తెచ్చుకున్నారు. దీంతో ఆయన పట్ల సత్యవేడులోనే కాకుండా జిల్లావ్యాప్తంగా కూడా సానుభూతి వ్యక్తమైంది. పెద్దిరెడ్డిని ఎదిరించిన తీరు కూడా పార్టీలకు అతీతంగా పలువురికి నచ్చింది. టీడీపీ ప్రభంజనం కలసిరావడంతో ఆయన ఎమ్మెల్యేగా గెలిచారు.

గెలిచిన ఆనందం అంతలోనే ఆవిరైన వైనం

సత్యవేడు ఎమ్మెల్యేగా రెండవ సారి గెలిచిన ఆనందం ఆదిమూలానికి ఎక్కువ రోజులు మిగలేదు. గతేడాది సెప్టెంబరులో ఆయన ఓ వివాదంలో చిక్కుకున్నారు. నియోజకవర్గంలో సొంత పార్టీకే చెందిన ఓ మహిళా నాయకురాలు ఆయనపై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసి, పోలీసులకు కూడా ఫిర్యాదు చేసారు. రాష్ట్రవ్యాప్తంగా ఆ ఘటన సంచలనం సృష్టించింది. ఆయనపై క్రిమినల్ కేసు నమోదైంది. దానిపై ఆయన కేసు కొట్టివేయాలని హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. అయితే ఫిర్యాదు చేసిన మహిళ అనూహ్యంగా హైకోర్టుకు వెళ్లి తన ఫిర్యాదు వెనక్కి తీసుకుంటానని అభ్యర్థించడంతో ఆ వివాదం అంతటితో ముగిసింది. ఈలోపు పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్న కారణంగా టీడీపీ అధిష్ఠానం ఆయనను పార్టీ నుంచీ సస్పెండ్ చేసింది. కేసు రాజీ పడినందున సస్పెన్షన్ ఎత్తివేస్తారని పార్టీ శ్రేణులు భావించినా సుమారు ఎనిమిది నెలలుగా అధిష్ఠానం దీనిపై దృష్టి సారించలేదు. ఈ ఎనిమిది నెలల్లో నియోజకవర్గంలో పార్టీ పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పనుల కోసం ఎన్నికల నాటి పరిశీలకుడు చంద్రశేఖర్ నాయుడు, తర్వాత నియమితులైన శ్రీపతి బాబులను కలవాలో, సస్పెన్షన్‌లో ఉన్న ఎమ్మెల్యేను కలవాలో అర్థంకాని పరిస్థితిలో కేడర్ ఉన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే హేమలత కూడా నియోజకవర్గంలో కనిపిస్తున్నారు.

తొలగని అస్పష్టత

లోకేశ్ పర్యటన సమయంలో నియోజకవర్గానికి పూర్తిస్థాయి కో ఆర్డినేటర్ లేదా ఇంచార్జిని ప్రకటించడమో చేస్తారని భావించారు. నాయకుడెవరో స్పష్టతనిస్తే తమ సమస్యలు చెప్పుకోవడానికి, పనులు చేసుకోవడానికి వీలు కలుగుతుందని కార్యకర్తలు అనుకున్నారు. అయితే యువనేత ఈ అంశంపై ఏమాత్రం దృష్టి పెట్టలేదు. సమస్యలుంటే ఇద్దరు పరిశీలకుల దృష్టికి తీసుకెళ్ళాలని, లేదంటే జిల్లా ఇంచార్జి మంత్రికి,పార్టీ రాష్ట్ర అధ్యక్షుడికి చెప్పాలని సూచించి వెళ్లిపోయారు. దీంతో ఎమ్మెల్యేపై సస్పెన్షన్ ఇప్పట్లో ఎత్తివేసే పరిస్థితి లేదని, అదే సమయంలో ఎవరినీ ఇంచార్జిగా నియమించే పరిస్థితి కూడా లేదని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. పార్టీ నియమించిన పరిశీలకులకు నియోజకవర్గంపై చెప్పుకోదగ్గ పట్టు లేదు. అధికారులు, ఉద్యోగులపై పట్టు అంతకన్నా లేదు. ఇంచార్జి మంత్రి అందుబాటులో వుండరు. దీంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో? పనులకు ఎవరిని ఆశ్రయించాలో? నామినేటెడ్ పదవులకు ఎవరు సిఫారసు చేస్తారో? తెలియక పార్టీ శ్రేణులు, ఆశావహులు గందరగోళంలో పడుతున్నారు.

శ్రీవారి సేవలో నిమ్మగడ్డ రమేష్‌కుమార్



తిరుమల, మే22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లిన ఆయన ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయక మండపానికి చేరుకున్న రమేష్‌కుమార్‌కు వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో విశ్వం విద్యార్థుల ప్రభంజనం

- రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన మోక్షిత్



మోక్షిత్‌ను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ - 2025లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతోపాటు విశ్వం విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించారని విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... 6, 9 తరగతుల ప్రవేశాలకుగాను ఏప్రిల్ 5న జాతీయ స్థాయిలో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 9వ తరగతి విభాగంలో వి. మోక్షిత్ మొత్తం 400 మార్కులకుగాను 370 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించాడు. 6వ తరగతి విభాగంలో 300 మార్కులకుగాను హృతిక్ రాయల్ 281 మార్కులు, వి.నిహార్ 275, సోహిని 270 మార్కులతో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. వీరితోపాటు రసజ్ఞ, జీవన్ సాయిరెడ్డి, ఆర్యన్‌రెడ్డి, భువనేష్, లోహిత్, మహీధర్, అశ్విన్ తదితరులు రాష్ట్రస్థాయిలో మంచి ర్యాంకులు సాధించారు. గురువారం తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వి.మోక్షిత్ తదితర విద్యార్థులను అభినందించారు. విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు గణితంలో 150/150, ఇంటెలిజెన్స్ టెస్ట్‌లో 50/50 మార్కులు పొంది రాష్ట్రానికే గర్వకారణంగా నిలిచారని వెల్లడించారు. పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలువేస్తూ అత్యుత్తమ శిక్షణ ఇస్తున్న అధ్యాపక బృందానికి, ఉన్నత విజయాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వం విద్యా సంస్థల కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి పాల్గొని విద్యార్థులను అభినందించారు. సమాచారం కావాల్సిన వారు 8688888802/9399976999లలో సంప్రదించాలని సూచించారు.

తిరుపతి బాలిక గిన్నిస్ రికార్డు



కీర్తన

తిరుపతి అర్బన్, మే 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎల్బీనగర్‌కు చెందిన ఆరవ కీర్తన గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించింది. గత ఏడాది డిసెంబర్ 1న హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఆధ్వర్యంలో 18 దేశాల నుంచి 1,500మంది బాలబాలికలు గంటపాటు ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డు కోసం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. కీర్తన అంతరాయం లేకుండా ఎలక్ట్రిక్ కీబోర్డ్ ప్లే చేసి గిన్నిస్ రికార్డుకు ఎంపికైనట్లు గిన్నిస్ వరల్డ్ రికార్డు టీమ్ సభ్యుడు రిచర్డ్(యూకే) గత ఏడాది డిసెంబర్ 14న ప్రకటించారు. విజయవాడకు చెందిన హలెల్ మ్యూజిక్ స్కూల్ ఫౌండర్ ఆగస్టిన్ ఏప్రిల్ 14న కీర్తనకు సర్టిఫికెట్, సిల్వర్‌మెడల్ ప్రదానం చేశారు. ఆ బాలికను, తల్లిదండ్రులు విజయబాబు, శైలజలను పలువురు అభినందించారు.

వెట్టికి బలైన బాలుడి కేసులో ముగ్గురికి రిమాండ్



నిందితులను మీడియాకు చూపిస్తున్న పోలీసులు

సత్యవేడు, మే 22 (ఆంధ్రజ్యోతి): తొమ్మిదేళ్ల గిరిజన బాలుడితో వెట్టి చాకిరి చేయించుకుని, అతడి మృతికి కారణమైన ఘటనలో ముగ్గురిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. సత్యవేడు సీఐ కార్యాలయంలో గురువారం ఈ వివరాలను పుత్తూరు డీఎస్పీ రవికుమార్ మీడియాకు వెల్లడించారు. ఆ ప్రకారం.. గూడూరు మండలం చవటపాళెం గిరిజన కాలనీకి చెందిన చెంచయ్య భార్య అంకమ్మ తన ముగ్గురు పిల్లలు, ప్రియుడితో కలిసి రెండేళ్ల కిందట సత్యవేడుకు వలసొచ్చారు. దళవాయి అగ్రహారంలోని ముత్తు వద్ద నెలకు రూ.10 వేల జీతానికి బాతులు మేపుతున్నారు. ఏడాది కింద చెంచయ్య మృతి చెందడంతో ఆమె చవటపాళెం వెళ్లారు. కర్మక్రియల అనంతరం అంకమ్మ సత్యవేడుకు వస్తుండగా.. అదే గ్రామానికి చెందిన సతీష్‌కు ఆమె రూ.25 వేల అప్పు ఉండడంతో, అతడు అడ్డుకున్నాడు. ఈ విషయం తెలిసి బాతుల వ్యాపారి ముత్తు చవటపాళెం వెళ్లి ఆ మొత్తాన్ని చెల్లించి అంకమ్మను సత్యవేడుకు తీసుకొచ్చి పనిలో పెట్టుకున్నాడు. అంకమ్మ, ఆమె పిల్లల చేత ముత్తు కుటుంబీకులు ఎక్కువ పనులు చేయించుకునే వారు. జీతం మాత్రం పెంచేవారు కాదు. దీంతో ఆమె పది నెలల క్రితం వెళ్లిపోతామని చెప్పడంతో, తన బాకీ రూ.42 వేలు చెల్లించాలని ముత్తు పట్టుబడ్డాడు. పది రోజుల్లో బాకీ చెల్లిస్తానంటే.. అప్పటి వరకు పిల్లాడిని (వెంకటేశులును) వదిలి వెళ్లాలని చెప్పాడు. దీంతో ముత్తు వద్ద ఉండిపోయిన వెంకటేశ్వర్లు బాతులు మేపే క్రమంలో ఆ బాలుడిని కంచికి తీసుకెళ్లాడు. అక్కడ ఏప్రిల్ 11న బాలుడు అనారోగ్యానికి గురికాగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ముత్తు చేర్పించాడు. చికిత్స పొందుతూ 12వ తేదీ మృతి చెందాడు. ఈ విషయాన్ని ముత్తు తన భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్‌కు చెప్పాడు. వారు కంచికి వెళ్లి బాలుడి మృతదేహాన్ని పాలారు నది ఒడ్డున పూడ్చి పెట్టేశారు. ఈ విషయాన్ని అంకమ్మకు చెప్పలేదు. నెలగా కుమారుడు ఫోన్ చేయకపోవడంతో 20 రోజుల క్రితం అంకమ్మ సత్యవేడుకు వచ్చి ముత్తును అడిగింది. కంచి పరిసర ప్రాంతాలలో బాతులు మేపేందుకు వెళ్లగా వెంకటేశ్వర్లు తప్పిపోయాడని, వెతికి తీసుకొస్తామని ఆమెను పంపించేశాడు. మళ్లీ ఈ నెల 15వ తేదీన వచ్చి బాకీ చెల్లించేస్తానని, తన బిడ్డను అప్పజెప్పాలని వేడుకుంది. ఇంకా పిల్లాడు దొరకలేదని చెప్పడంత ఆమె గట్టిగా నిలదీసింది. ముత్తు, అతడి భార్య ధనభాగ్యం, కుమారుడు రాజశేఖర్ కలిసి అంకమ్మను కులం పేరుతో దూషించి బయటకు గెంటేశారు. దీనిపై ఈనెల 19వ తేదీన ఆమె సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రామస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ సత్యవేడుకు చేరుకుని విచారణ చేపట్టి, ముత్తుతో పాటు ఆయన కుటుంబ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీతో పాటు వెట్టిచాకిరి కేసులను నమోదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించడంతో అసలు విషయం బయటపడింది. పుత్తూరు డీఎస్పీ రవికుమార్ ఆధ్వర్యంలో సీఐ మురళి, వరదయ్యపాళెం, పిచ్చాటూరు ఎస్‌ఐలు మల్లికార్జున, వెంకటరమణ, సిబ్బంది మంగళవారం కంచికి వెళ్లి.. తమిళనాడు పోలీసుల సాయంతో బాలుడి మృతదేహం కోసం గాలించారు. బుధవారం సాయంత్రం గుర్తించి మృతదేహాన్ని వెలికి తీశారు. కంచి తాలూకా మెజిస్ట్రేట్ రఫీక్ ఆధ్వర్యంలో బాలుడి తల్లి అంకమ్మ సమక్షంలో శవానికి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం చెంగల్పట్టు మెడికల్ కాలేజీకి తరలించినట్లు డీఎస్పీ రవికుమార్ తెలిపారు.

కష్టంగా ఉందమ్మా.. నన్ను తీసుకెళ్లమ్మా

బాతులు మేపే క్రమంలో బాలుడు వెంకటేశులును యజమాని ముత్తు చాలా హింసించేవాడని తెలిసింది. ముత్తు దగ్గర ఉన్న వెయ్యి బాతులను ఆ పసిపిల్లాడు ఒక్కడే మేపేవాడని, అతడితో విపరీతమైన పని చేయించుకునేవాడని తెలిసింది. ఈ క్రమంలో బాలుడిని ఎక్కడికి పోనివ్వకుండా పారిపోతే చంపేస్తా, కేసు పెట్టి జైలులో వేస్తానంటూ బెదిరిస్తూ కర్కశంగా వ్యవహరించే వాడని తెలిసింది. వెంకటేశులు తల్లికి ఫోన్ చేసినప్పుడల్లా ఇదే విషయం తల్లితో చెప్పి ఏడ్చేవాడని పోలీసుల విచారణలో కనుగొన్నారు. డబ్బులు కుదరలేదని, డబ్బులు వచ్చిన వెంటనే వచ్చి విడిపించుకుని వెళతానని తల్లి అంకమ్మ బాలుడికి నచ్చచెప్పేదని తెలిసింది.

టీడీపీ శ్రేణులకు అండగా..!

- గత కార్పొరేషన్ ఎన్నికల్లో తలపడ్డ వారికే మళ్లీ అవకాశం
- తిరుపతిని ఫ్లెక్సీ, ప్లాస్టిక్ ఫ్రీ సిటీగా మారుస్తాం
- మినీ మహానాడులో తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ

తిరుపతి, మే 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలకు ఎదురొడ్డి గత కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీచేసిన 23 మంది కార్పొరేట్ అభ్యర్థులకే తిరిగి అవకాశం ఇవ్వాలని తిరుపతిలో గురువారం జరిగిన మినీ మహానాడులో తీర్మానించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, ఏపీసీబీసీ ఛైర్‌పర్సన్ సుగుణమ్మ మాట్లాడుతూ.. గత ఐదేళ్లు పార్టీకోసం కష్టపడి పనిచేసిన వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగదని చెప్పారు. కాస్త ఆలస్యమైనా పార్టీ కేడర్‌కు ఇబ్బందిలేకుండా చూసుకుంటామన్నారు. ప్రభుత్వ రంగసంస్థల్లోని కాంట్రాక్టు పనుల్లో పార్టీ నాయకుల్లో ప్రాధాన్యత, పార్టీ నాయకుల కుటుంబ సభ్యులకు వివిధ సంస్థల్లో అర్హతను బట్టి ఉద్యోగ భద్రత కల్పించాలని నిర్ణయించారు. తిరుపతి నగరాన్ని బ్యానర్ ఫ్రీ, ప్లాస్టిక్‌రహిత నగరంగా ఉంచాలని రాబోయే రోజుల్లో మరిన్ని మొక్కలునాటి సుందరంగా తీర్చిదిద్దాలన్న సుగుణమ్మ ప్రతిపాదనతో తీర్మానం చేశారు. ఈనెల 27 నుంచి కడపలో జరగనున్న మహానాడుకు భారీగా తరలి వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. టీడీపీ నాయకులు మల్లవరం స్వాతి, ఎం.లక్ష్మీదేవమ్మ, వసంతమ్మ, 17వ డివిజన్ ప్రధాన కార్యదర్శి హేమావతి భర్త శివయ్య, ఎమ్మార్‌పల్లి నాగేంద్రబాబు కుమారుడు చేతన్ మృతిపట్ల సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు బి.వి.కీర్తి, మబ్బు దేవనారాయణ రెడి, రుద్రకోటి సదాశివం, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాస్, డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, పులుగోరు మురళీకృష్ణ రెడ్డి, శ్రీధర్ వర్మ, దంపూరి భాస్కర్, నూరా సుధాకర్ రెడ్డి, బుల్లెట్ రమణ, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, బీజీ కృష్ణయాదవ్, పుష్పావతి, బ్యాంక్ శాంతమ్మ, కుమారమ్మ, కరాటే చంద్ర, మునిశేఖర్ రాయల్, సుబ్బు యాదవ్, రేవతి, సూర్యకుమారి, రాజారం, విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

పూర్ణ-తిరుపతి ప్రత్యేక రైలుకు అదనపు బోగీలు

తిరుపతి(సెంట్రల్), మే 22(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ కారణంగా పూర్ణ-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక రైళ్ల(07609-07610)కు జూలై ఒకటో తేదీ వరకు మూడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2ఏసీ-1, 3ఏసీ-1, స్లీపర్ క్లాస్-1 కోచ్‌లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



విత్తనం చల్లుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పచ్చిరొట్ట సాగుకు సబ్సిడీపై విత్తనాల కిట్లు

దొరవారిసత్రం, మే 22(ఆంధ్రజ్యోతి) : ఈ యేడాది జిల్లా వ్యాప్తంగా 25 వేల ఎకరాల్లో పీఎండీఎస్ కింద చిరు ధాన్యాల విత్తలనాలతో పచ్చిరొట్ట పంట సాగుకు ప్రణాళిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ వ్యవసాయ అధికారులకు సూచించారు. దొరవారిసత్రం మండలం లింగంపాడు గ్రామంలో పది రకాల చిరు ధాన్యాలు కలిపిన విత్తనాలతో పచ్చిరొట్ట సాగు చేసిన గోవర్ధన్ పొలాన్ని గురువారం ఆయన పరిశీలించారు. చిరుధాన్యాలతో కూడిన కిట్లను 50 శాతం రాయితీతో ప్రభుత్వం అందజేస్తుందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈసాగు వల్ల రసాయనిక ఎరువుల వాడకంతో పాటు పెట్టుబడులు తగ్గుతాయన్నారు. తర్వాత ఆయన చిరు ధాన్యాలను పొలంలో చల్లారు. నెర్రికాలువను బాగు చేయించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఏపీసీఎన్‌ఎఫ్ డీపీఎం షణ్ముగం, ఏడీఏ అనిత, ఏవో జ్యోతిర్మయి, వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలి

- వెంకటగిరి మినీ మహానాడులో తీర్మానం

వెంకటగిరి, మే 22 : (ఆంధ్రజ్యోతి) వెంకటగిరిలో గురువారం నిర్వహించిన మిని మహానాడులో మంత్రి నారా లోకేశ్‌కు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ పెసిడెంట్ హోదా కల్పించాలని, ఎన్టీఆర్‌కు భారతరత్న అవార్డు ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణం, సోమశిల-స్వర్ణముఖి లింకు కెనాల్ పూర్తి, వెంకటగిరి- గూడూరు రోడ్డు పనులు,వెంకటగిరిలో చేనేత.. బీఆర్ అంబేడ్కర్ భవనాల నిర్మాణం, రాపూరు చెరువును రిజర్వాయరుగా మార్చడం, పోకూరుపల్లి లిఫ్టు ఇరిగేషన్ మంజూరు, వెంకటగిరిలో 30 పడకల ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేయడం వంటి అభివృద్ధి పనులను సభ తీర్మానం చేసింది.

ట్రావెల్స్ బస్సు అపహరణ

తిరుపతి(నేరవిభాగం), మే 22 (ఆంధ్రజ్యోతి):ఏకంగా ఓ ట్రావెల్స్ బస్సునే దుండగులు దొంగిలించారు. ఈ ఘటన తిరుపతిలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపిన ప్రకారం.. బుధవారం రాత్రి టీఎన్ 02బీయూ 1030 నెంబరు బస్సును డ్రైవర్ శ్రీధర్ తీసుకొచ్చి చింతలచెరువు రోడ్డులోని ఓ పార్కింగ్ ప్లేస్‌లో ఉంచారు. బస్సును గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారని ఆ పార్కింగ్ యజమాని ఫోన్ చేసి డ్రైవరుకు చెప్పడంతో అతడు, మరికొందరితో కలిసి చుట్టుపక్కల వెతికారు. బస్సు కనిపించకపోవడంతో ఓనర్ రవీంద్రకు డ్రైవరు తెలియజేశారు. ఎక్కడా బస్సు కనిపించకపోవడంతో గురువారం ఈస్ట్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ కేసు నమోదు చేశారు.కాగా గురువారం మధ్యాహ్నం 2గంటలకు పుంగనూరు సమీపంలో ప్రమాదానికి గురైన ఆ బస్సును పోలీసులు గుర్తించి యజమానికి సమాచారమిచ్చారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), మే 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గురువారం జరిగిన పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 579 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 31 కేంద్రాల్లో 4,436 మంది హాజరు కావాల్సి ఉండగా 3,857 మంది పరీక్షలు రాశారని వివరించారు. అలాగే ఓపెన్ స్కూల్ పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు 8 కేంద్రాల్లో జరుగుతున్నాయని, గురువారం గణిత పరీక్షకు 435 మంది విద్యార్థులకుగాను 54మంది గైర్హాజరయ్యారని తెలిపారు.ఓపెన్ స్కూల్ ఇంటర్ ఫిజికల్ సైన్స్, పొలిటికల్ సైన్స్ పరీక్షలకు 60 మంది గైర్హాజరయ్యారని వివరించారు.